క్లుప్తంగా

శనైశ్వరాలయం కిటకిట



బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో జైష్ఠాదేవి సమేత శనైశ్వరాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. ప్రధాన అర్చకుడు గవ్వమఠం విశ్వనాథశాస్త్రి భక్తులతో గోత్రనామార్చన, తిలతైలాభిషేకం, ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్థానిక శివాలయంలో అభిషేకం, అర్చనలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సాగునీరు ఎప్పుడిస్తారో చెప్పాలి

కల్వకుర్తిరూరల్: అసంపూర్తి ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించడం హాస్యాస్పదమని రైతు జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ బండెల రాంచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎత్తిపోతల పథకంలో రిజర్వాయర్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదన్నారు. ప్రధాన కాల్వ అసంపూర్తిగానే ఉందన్నారు. ఈ పథకంతో కల్వకుర్తి నియోజకవర్గంలోని చివరి ఆయకట్టుకు సాగునీరు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పుస్తకాల ఆవిష్కరణ



కల్వకుర్తి: పట్టణానికి చెందిన కవి లక్ష్మారెడ్డి రచించిన వెన్నెల జల్లులు, వెన్నెల కల్వలు, వెన్నెల మణిపూసలు పుస్తకాలను శనివారం స్థానిక వైఆర్‌ఎం జూనియర్ కళాశాలలో సాహితీ సమితి సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవి పండితులు రుక్మాందరెడ్డి, సురేందర్‌రెడ్డి, సాంబయ్యగౌడ్ మాట్లాడుతూ కల్వకుర్తి మట్టిలో ఎంతో మహాత్యం ఉందన్నారు. ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరిలో కవిత్వం కనిపిస్తుందన్నారు. శంకరయ్య, సదానందం గౌడ్, శీనయ్య, నారాయణగౌడ్, సుధాకర్, దామోదర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం



అచ్చంపేట రూరల్: పట్టణం నుంచి ఉమ్రా యాత్రకు వెళ్తున్న మసీద్ ఇమామ్ హఫీజ్‌గౌస్, అక్బర్, ఖాజా, మన్సూర్‌ఖాన్, అహ్మద్, సుభాన్, జబ్బార్, అక్బర్‌లను శనివారం మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉమ్రా యాత్రలో నియోజకవర్గ ప్రజల క్షేమం కోసం ప్రార్థించాలని కోరారు. మసీదు కమిటీ అధ్యక్షుడు సిద్దిక్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్యం తగదు'



నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బి.శ్రీనివాస్, ఎంపీ ఎస్సీ కోకన్వీనర్ దశరథం అన్నారు. పట్టణంలోని గాంధీ పార్క్‌లో చేపట్టిన రిలే దీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణతో రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉండదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాములు, కృష్ణయ్య, రాజు, మల్లేష్, శ్రీకాంత్, ఉదయ్, మృగరాజు, మహేష్, శేఖర్, ప్రభాకర్ ఉన్నారు.

నిరవధిక సమ్మెను విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: మధ్యాహ్నభోజన పథకం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఈనెల 20 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూటీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ కోరారు. శనివారం మండలంలోని కుమ్మెరలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. చిన్నపాగ శ్రీనివాసులు, ఎల్లమ్మ, మణెమ్మ, అలివేల ఉన్నారు.

యువతి అదృశ్యం

బల్మూర్: మండల కేంద్రానికి చెందిన హైమావతి మేనకోడలు అనూష (19) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఉప్పునుంతలకు చెందిన యువతి.. కొన్ని రోజులుగా మేనత్త వద్ద ఉంటున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని, కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకపోయిందని తెలిపారు. యువతి చిన్నాన్న నాగార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సామాన్య ప్రజల అవస్థలు

- సీఎం పర్యటనతో దుకాణాల మూసివేత
- 2 గంటలకుపైగా వాహనాల రాకపోకలకు అంతరాయం



వెల్దండలో సీఎం కాన్వాయ్

కల్వకుర్తి: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్వకుర్తి మీదుగా కొల్లాపూర్‌కు రోడ్డు మార్గాన వెళ్లారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా ముఖద్వారమైన వెల్దండ మండలం రాఘాయిపల్లి నుంచి పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వెల్దండలో పోలీసులు భారీగా మోహరించడంతోపాటు రోడ్డుపై ఉన్న దుకాణాలను మూసివేశారు. అదేవిధంగా కొట్ర జంక్షన్ వద్ద 2గంటలకు పైగా హైదరాబాద్ వైపునకు వెళ్లే వాహనాలను అనుమతించలేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా నుంచి పాలమూరు చౌరస్తా, నాగర్‌కర్నూల్ రోడ్డులో ఉన్న చాలా దుకాణాలను పోలీసులు మూసివేయించారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అవస్థలు పడ్డారు. ఇదిలా ఉంటే దుకాణాల ముందు నిలిపిన వాహనాలను పోలీసులు లాక్కెళ్లారని పలువురు వాపోయారు. ఉదయం నుంచే పోలీసులు అన్ని వీధుల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ భద్రతను పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి వరకు 320 మంది, శనివారం మరో 50 మంది పోలీసులు విధులను నిర్వర్తించారు. సీఎం భద్రతను సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షించగా, ఐదుగురు డీఎస్పీలు, 10మంది సీఐలు, 25మంది ఎస్‌ఐలు, 50మంది ఏఎస్‌ఐలతోపాటు కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధుల్లో ఉన్నారు. సీఎం కాన్వాయ్ వెళ్లే మార్గాలలో ప్రతి 150 మీటర్లకు ఇద్దరు పోలీసులు, ప్రధాన కూడళ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎస్‌ఐ స్థాయి అధికారి పర్యవేక్షించారు.

రోడ్లన్నీ శుభ్రం..



కొట్ర జంక్షన్‌లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కల్వకుర్తి టౌన్: సీఎం కేసీఆర్ పర్యటనతో రోడ్లన్నీ శుభ్రమయ్యాయి. పీఆర్‌ఎల్‌ఐ ప్రారంభోత్సవానికి కల్వకుర్తి మీదుగా సీఎం వెళ్తున్నారన్న సమాచారం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు.. పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. మున్సిపాలిటీలోని కొట్రతండా నుంచి సంజాపూర్ వరకు రోడ్లపై చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించారు. హైదరాబాద్ చౌరస్తాలో కొన్నేళ్లుగా ఇబ్బందికరంగా మారిన మట్టిని తొలగించారు. సీఎం పర్యటన పుణ్యమా అని పట్టణ రోడ్లు, కూడళ్లు శుభ్రంగా మారాయి. మున్సిపాలిటీలో విలీనమైన నాటి నుంచి ఎలాంటి చర్యలు చేపట్టని అధికారులు.. సీఎం పర్యటన సందర్భంగా కొట్ర జంక్షన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం ఆనందంగా ఉందని తండావాసులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సీఎం పర్యటన నేపథ్యంలో ప్రధాన రహదారిపై దుకాణాలను మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

ముందు జాగ్రత్తలతోనే వ్యాధులు దూరం



పెద్దకొత్తపల్లిలో మందులు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్

పెద్దకొత్తపల్లి: ముందు జాగ్రత్తలతోనే వ్యాధులు దూరమవుతాయని డీఎంహెచ్‌ఓ సుధాకరల్‌లాల్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు అవసరమైన మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవినాయక్, విజయ్‌కుమార్, ధీరజ్, చెన్నయ్య, శ్రీనివాస్, దేవేందర్, శ్రీధర్, నర్సింహ, సలీం, గిరి, కరుణ, రాణి పాల్గొన్నారు.

తాడూరు: సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా మండలంలోని మేడిపూర్ నుంచి తాడూరు వరకు వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో శిబిరాన్ని వైద్యాధికారి వెంకటదాసు పరిశీలించి, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సునీత, తారమ్మ, దాసు, రాజేశ్వరి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తెలకపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

నాగర్‌కర్నూల్‌రూరల్: అంగన్‌వాడీల సమస్యలపై సీఎం కేసీఆర్ స్పందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు అన్నారు. సమ్మె శిబిరంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్, తిరుపతమ్మ, అంజనమ్మ, జయమ్మ, యాదమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

తెలకపల్లి: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ చంద్రకళ కోరారు. అంగన్‌వాడీల సమ్మె శనివారంతో 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలపై నిర్లక్ష్యధోరణి అవలంబించడం సరికాదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గోపాస్ లక్ష్మణ్, అక్బరీ, జహీరాబేగం, ప్రభావతమ్మ, జ్యోతి, విద్యావతి, సుకన్య, భారతమ్మ, లక్ష్మమ్మ, అబీబా, శ్రీలత, అరుణ పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాలు సుచిత్ర పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు తీర్చే వరకు బిల్లులు కట్టం



విద్యుత్ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

బల్మూర్: అప్రకటిత విద్యుత్ కోతలపై గోదల్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం విద్యుత్ బిల్లుల కోసం వచ్చిన సిబ్బందిపై తిరగబడ్డారు. విద్యుత్ కోతలు తీర్చే వరకు బిల్లులు చెల్లించేదిలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యుత్ అధికారులు, సిబ్బందికి బిల్లుల వసూలుపై ఉన్న శ్రద్ధ.. కరెంటు సరఫరా విషయంలో లేకుండా పోయిందన్నారు. రాత్రివేళలోనూ విద్యుత్ కోతలు విధిస్తుండడంతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వం 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతుండగా, ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు. కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తేనే బిల్లులు చెల్లిస్తామని తేల్చి చెప్పారు. దీంతో బిల్లుల కోసం వచ్చిన సిబ్బంది చేసేదిలేక వెనుదిరిగారు.

అర్హులందరికీ గొర్రెల పంపిణీ



చౌదర్‌పల్లిలో గొర్రెల యూనిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

వెల్దండ: ప్రభుత్వం సబ్సిడీపై అందించే గొర్రెల యూనిట్లను అర్హులందరికీ పంపిణీ చేస్తామని మండల పశువైద్యాధికారి శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి, రాఘయపల్లి గ్రామాల్లో శనివారం 24 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీ గొర్రెలతో లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. రెండో విడత ఎంపికైన లబ్ధిదారులు డీడీలు చెల్లిస్తే యూనిట్లను అందజేస్తామన్నారు. సర్పంచులు గాలమ్మ, అచ్చాలు, నాయకులు రామస్వామి, బాల్‌లక్ష్మయ్య, కొండల్‌యాదవ్, కొండల్, శ్రీనివాసులు, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యటన అడ్డుకుంటారని అరెస్ట్



కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ప్రతిపక్ష నాయకులు



కోడేరులో..

కల్వకుర్తిరూరల్: సీఎం కేసీఆర్ పర్యటనను అడ్డుకుంటారనే అనుమానంతో పోలీసులు ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. పట్టణంలో అర్ధరాత్రి నుంచే అరెస్ట్‌ల పర్వం ప్రారంభమైంది. కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్ట్, ప్రజా సంఘాల నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కందనూలు: జిల్లా కేంద్రంలోని పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి తిమ్మాజిపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సుధాకర్‌రెడ్డి, బొట్టు శ్రీను, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మయ్య ఉన్నారు.

పెంట్లవెల్లి: సీఎం పర్యటన సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ, సీఐటీయూ, సీపీఎం, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అక్రమ అరెస్ట్‌లతో తమ పోరాటాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు.

చారకొండ: మండలంలోని కాంగ్రెస్, ధర్మ సమాజ్ పార్టీ నాయకులను పోలీసులను ముందస్తుగా అరెస్ట్ చేశారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బాల్‌రాంగౌడ్, అంజయ్య, గణేష్‌గౌడ్, రాధాకృష్ణ, చంద్రశేఖర్, విజయ్, అయోధ్య, కొండల్, నాగరాజు ఉన్నారు.

లింగాల: మండలంలోని కాంగ్రెస్, బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పూజారి వెంకటయ్య, బీజేపీ అధ్యక్షుడు సలేశ్వరం తదితరులు ఉన్నారు.

కోడేరు: మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కాకుండానే ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు.

సీఎం పర్యటనలో అరెస్టుల పర్వం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ప్రతిపక్ష పార్టీలు, పలు సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం పర్యటన సందర్భంగా ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెల్దండ: మండలంలోని బీజేపీ, కాంగ్రెస్, అంగన్‌వాడీ సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండల కేంద్రం మీదుగా సీఎం కన్వాయ్ వెళ్తున్న సందర్భంగా ఎస్పీ పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు.

ఊర్కొండ: మండలంలోని ప్రతిపక్ష నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో వెంకటయ్యగౌడ్, ఆంజనేయులు, నిరంజన్‌గౌడ్, విజయుడు, ఎండీ అరిఫ్, యాదయ్య, మహేందర్, రాజు, దయాకర్ ఉన్నారు.

బిజినేపల్లి: ప్రతిపక్ష నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం అణచివేతలో భాగమే అని జేఏసీ జిల్లా చైర్మన్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. తిమ్మాజిపేట పోలీస్‌స్టేషన్ నుంచి విడుదలైన తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. తమను ఏ చట్టం కింద 28గంటలపాటు పోలీస్‌స్టేషన్‌లో ఉంచారని ప్రశ్నించారు.

సీఎంకు ఘన స్వాగతం



కొల్లాపూర్ రూరల్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం కేసీఆర్‌కు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌరస్తా వరకు మహిళలు పూల వర్షం కురిపించారు.

కల్వకుర్తిరూరల్: పట్టణం మీదుగా వెళ్తున్న సీఎం కేసీఆర్‌కు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. బస్సులో నుంచి సీఎం స్థానికులకు అభివాదం చేశారు.

సేవాభావం అలవర్చుకోవాలి

కల్వకుర్తిరూరల్: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని విద్యుత్ ఏడీఈ చంద్రశేఖర్ కోరారు. ఇంజినీర్స్ డేను పురస్కరించుకొని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఏడీఈని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆంజనేయులు, అశోక్, శివజగదీశ్వర్, చిగులపల్లి శ్రీధర్, కృష్ణయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం



నడింపల్లిలో విద్యార్థులు తయారు చేసిన విగ్రహాలు

అచ్చంపేట రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని ఉపాధ్యాయుడు శ్రీశైలం కోరారు. మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం మట్టి గణపతుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బంకమట్టితో వివిధ ఆకృతుల్లో గణపతులను తయారు చేశారు. వినాయక చవితి ఉత్సవాల్లో రంగులు, హంగులు ముఖ్యం కాదని, విగ్రహంతో కూడిన భక్తి ముఖ్యమని వివరించారు. హెచ్‌ఎం సామ్యా నాయక్, ఉపాధ్యాయులు శంకరయ్య, జయమ్మ పాల్గొన్నారు.

కాంతార మట్టి గణపతి..

బిజినేపల్లి: మండల కేంద్రంలోని మట్టి గణపతుల తయారీ కేంద్రంలో 14 ఫీట్ల ఎత్తుగల కాంతార మట్టి గణపతి చూపరులను ఆకట్టుకుంటోంది. వినాయకుడి తలపై వరాహరూప ముఖ అవతారం ఉండి, వెనకాల కాంతార రూపంలో తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నట్లు తయారీదారు నాగపురి దశరథం తెలిపారు.

25 శాతానికి రిజర్వేషన్ పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నయ్య

నాగర్‌కర్నూల్‌రూరల్: రాజకీయ పార్టీలు మాలమాదిగల మధ్య చిచ్చు పెట్టకుండా జనాభా పెరుగుదలకు అనుగుణంగా 25శాతానికి రిజర్వేషన్ పెంచాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి మాలల మహాగర్జన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 19నుంచి 22వ తేదీ వరకు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రతి గ్రామంలో మాలలకు కమ్యూనిటీ కమ్యూనిటీ భవనాలు, చెన్నకేశవ గుడి నిర్మాణానికి అవసరమైన స్థలం, నిధులు కేటాయించాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు రిజర్వేషన్ స్థానాల్లోనే కాకుండా జనరల్ స్థానాలలోనూ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశాన్ని లేవనెత్తే పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి చిన్న వెంకటేష్, చెన్నయ్య, పెరముల్ల రాజేష్, కృష్ణయ్య, చంద్రశేఖర్, అరుణ్‌కుమార్, ఆనంద్, మల్లేష్, కురుమయ్య, మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చెందిన 30మంది బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు శనివారం డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఓయూ విద్యార్థి నాయకుడు విష్ణు, డీసీసీ కార్యదర్శి రేణయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి వంశీకృష్ణ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు చెప్పే మోసపూరిత మాటలు, హామీలతో ప్రజలు విరక్తి చెందారన్నారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు.

దారులన్నీ కొల్లాపూర్‌వైపే..



మన్ననూర్ నుంచి



చారకొండ నుంచి..

సీఎం సభకు బయల్దేరిన బీఆర్‌ఎస్ శ్రేణులు

కల్వకుర్తి/కల్వకుర్తిరూరల్: కొల్లాపూర్‌లో శనివారం నిర్వహించిన సీఎం కేసీఆర్ బహిరంగ సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో కొల్లాపూర్‌కు బయల్దేరారు.

చారకొండ: సీఎం సభకు అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఎంపీపీ విజేందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటయ్యయాదవ్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక వాహనాల్లో కొల్లాపూర్‌కు బయల్దేరారు. జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రావు, గణేష్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, కాశన్న, ఎంపీటీసీ రేణుక, నాగరాజు, సర్పంచ్‌లు ఇందిరా, రవినాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని గోప్లాపూర్, జటప్రోల్, మంచాలకట్ట, మల్లేశ్వరం, పెంట్లవెల్లి, కొండూరు గ్రామాల నుంచి సీఎం సభకు భారీగా తరలివెళ్లారు. దాదాపు 55 బస్సుల్లో బయల్దేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాజేష్, సురేందర్‌గౌడ్, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: మండల కేంద్రంతోపాటు మాచారం, వెంకటేశ్వర్లబావి, తుర్కపల్లి తదితర గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు కొల్లాపూర్‌కు తరలివెళ్లారు.

వెల్దండ: మండలం న ఉంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఎం సభకు భారీగా బయల్దేరారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, జెడ్పీటీసీ విజితారెడ్డి, వెంకటయ్యగౌడ్, జయప్రకాష్ పాల్గొన్నారు.

తెలకపల్లి: మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాల్లో కొల్లాపూర్‌కు బయల్దేరారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు సీఎం సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో రమేష్, పర్వతాలు, శ్రీనివాసులు, మశన్న, కృష్ణయ్య పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అన్ని గ్రామాల నుంచి సీఎం సభకు ప్రత్యేక వాహనాల్లో పెద్దఎత్తున బయల్దేరారు.

కోడేరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఎం కేసీఆర్ సభకు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఊర్కొండ: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల నుంచి సీఎం సభకు భారీగా తరలివెళ్లారు. ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాల్లో కొల్లాపూర్‌కు బయల్దేరారు.